సాక్షి నల్లగొండ

గురువారం । 16 । మార్చి । 2023



ఘనత కేసీఆర్‌దే..
గోదావరి జలాలు తీసుకురావాలనే బీఎన్ కలను సాకారం చేసిన ఘనత కేసీఆర్‌దేనని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు.
- 8లో



కొనసాగుతున్న నాటక పోటీలు
మిర్యాలగూడలోని జాతీయ స్థాయి పద్య, సాంఘిక నాటక పోటీలు బుధవారం 6వ రోజూ కొనసాగాయి.
- 8లో

గరిష్టం/కనిష్టం
36°/23°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి 'శ్రీవల్లి' వేలం

నల్లగొండ : నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డి గూడెం సమీపంలోని రాజీవ్ స్వగృహ శ్రీవల్లి టౌన్‌షిప్‌లోని 133 ఓపెన్ ప్లాట్‌లు, 253 పాక్షిక నిర్మాణ గృహాలకు గురువారం నుంచి మూడు రోజుల పాటు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటన తెలిపారు. కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించే వేలంలో పాల్గొనాలనుకునే వారు రూ.10 వేల డీడీని కలెక్టర్ పేరున తీయాలని పేర్కొన్నారు.

18న దర్వేశిపురంలో వేలం

కనగల్ : మండలంలోని దర్వేశిపురం(పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థానం వద్ద 2023–24 ఏడాది కాలానికి తలనీలాలు సేకరించడం, వాహనాలకు బొట్టు పెట్టడం, కొబ్బరి చిప్పలు సేకరించడం, మిఠాయి అమ్ముకునే హక్కు, ఫొటోలు తీసేందుకు ఈ నెల 18న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ జల్లేపల్లి జయరామయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ఏదేని జాతీయ బ్యాంకులో కార్య నిర్వహణాధికారి శ్రీ యల్లమ్మ దేవస్థానం గ్రామం దర్వేశిపురం పేరు మీద డీడీ తీయాలన్నారు. 18న మధ్యాహ్నం ఒంటి గంటకు దేవస్థానం వద్ద ఏర్పాటుచేసిన టెండర్ బాక్స్‌లో సీల్డు టెండర్‌తోపాటు డీడీ జతపరిచి వేయాలన్నారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రజకులకు రూ.5 లక్షల రుణాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆశయ్య

నల్లగొండ టౌన్ : రజక వృత్తిదారులకు ప్రభుత్వం రూ.5 లక్షలు రుణాలు మంజూరు చేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో నిర్వహించిన రజక వృత్తిదారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 10 లక్షలకు పైగా రజక వృత్తిదారులు ఉన్నారని, వారంతా ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర వెనుకబాటుకు గురయ్యారని అన్నారు. ప్రభుత్వం మోడ్రన్ దోబీఘాట్లు, ఉచిత విద్యుత్ అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చేతి వృత్తిదారుల జిల్లా కన్వీనర్ గంజి మురళి, బండా శ్రీశైలం, పాదిల శ్రీనివాస్, ఆవనగంటి నరేష్, దొండ కొండ వెంకన్న, నాగిళ్ల శంకర్, అక్కెనపల్లి సైదులు, చిక్కుల పాపులు, రుద్రారపు పెద్దులు, ఐతరాజు నర్సింహ పాల్గొన్నారు.

జన చైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్: వరంగల్‌లో శుక్రవారం ప్రారంభమై ఈ నెల 29వ తేదీ వరకు కొనసాగే జన చైతన్య యాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జన చైతన్య యాత్ర వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జన చైతన్య యాత్ర ఈ నెల 25, 26, 27 తేదీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాగుతుందని తెలిపారు. బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మూడు జాతలను ఏర్పాటు చేసి యాత్రలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ విధానాల వలన దేశానికి, రాష్ట్రానికి కలిగే నష్టాలను ప్రజలకు వివరించి చైతన్యపరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు జగదీష్‌చంద్ర, ముడావత్ రవినాయక్, కందుకూరి రమేష్, మంగారెడ్డి, సైదులు, అయ్యూబ్, పాదూరి గోవర్ధని, వెంకటరెడ్డి, పాపారావు, పఠాని శ్రీనివాస్ ఉన్నారు.

ఉపాధి పనులు ముమ్మరంగా చేపట్టాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా చేపట్టాలని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 34 పంచాయతీల్లో వర్క్‌రేట్ సరాసరి 49 మంది మాత్రమే ఉందని.. దీనిని వంద మందికి పెంచి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఖాజా అస్గర్‌అలీ, ఎంపీఓ పద్మ, ఇన్‌చార్జ్ ఏపీఓ శ్రీరాములు, టీఏలు నాగలక్ష్మి, బాలాజి, కార్తీక్‌రెడ్డి, జ్యోతి, సైదులు ఉన్నారు.

పైసల్లేవు.. పనులెలా!

పంచాయతీలకు నాలుగు నెలలుగా అందని నిధులు

- అభివృద్ధి పనుల బిల్లులు సైతం పెండింగ్
- అత్యవసర పనులకు అప్పులు చేస్తున్న సర్పంచ్‌లు
- బిల్లుల కోసం తప్పని ఎదురుచూపులు



ట్రాక్టర్‌ను ఎంపీడీఓకు అప్పగిస్తున్న గుర్రంపోడు మండలం జూనూతల సర్పంచ్ (ఫైల్)

నల్లగొండ నియోజకవర్గ పరిధిలోని ఒక గ్రామ పంచాయతీల్లో చేసిన పనులకు సంబంధించి రూ.10 లక్షల వరకు బిల్లు పెండింగ్‌లో ఉంది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మరో రూ.15 లక్షల బిల్లు ఆగిపోయింది. ఇంకుడు గుంతలు ఇతర పనులకు సంబంధించి మరో రూ.5 లక్షలు రావాల్సి ఉంది. ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. కనీసం గ్రామ పంచాయతీలో ట్రాక్టర్‌కు డీజిల్ పోయించడానికి కూడా డబ్బులు లేని పరిస్థితి. అప్పులు తెచ్చి పనులు చేశాడు. వారికి సమాధానం చెప్పలేక ముఖం చాటేస్తున్నానని చెబుతున్నాడు ఆ గ్రామ సర్పంచ్. ఇదీ జిల్లాలో సర్పంచ్‌ల పరిస్థితి.

నల్లగొండ : గ్రామ పంచాయతీలు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టు మిట్టాడుతున్నాయి. ప్రతి నెలా వచ్చే నిధులు సక్రమంగా విడుదల కాకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా తయారైంది. 15వ ఆర్థిక సంఘం నిధులు సైతం నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉండడంతో గ్రామాల్లో పనులు చేసేందుకు సర్పంచ్‌లు నానా అవస్థలు పడుతున్నారు. అప్పుచేసి పనులు చేసినా సకాలంలో బిల్లులు రాకపోవడంతో బయట తిరగలేకపోతున్నారు.

ప్రతి నెలా రూ.15 కోట్లు..
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీల అభివృద్ధికి గతంలో ప్రతినెలా నిధులు కేటాయించేవి. ప్రతి నెలా జిల్లాకు రూ.15 కోట్ల వరకు విడుదలయ్యేవి. వీటిలో 15 శాతం జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లకు కేటాయించే వారు. మిగిలినవి గ్రామ పంచాయతీల్లో పనులకు ఉపయోగించేవారు. తొలుత కేంద్రానికి సంబంధించిన ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ప్రభుత్వ నిధులు ప్రతినెలా కలిపి వచ్చేవి. తర్వాత ఒక నెల కేంద్రం నిధులు, మరో నెల రాష్ట్ర ప్రభుత్వ నిధులు వచ్చేవి. ఇప్పుడు ఆరు నెలలు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సంఘం నిధులు, ఆరు నెలలు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్నాయి. అయితే కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు గతేడాది సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలలకు సంబంధించి విడుదల చేయలేదు. తర్వాత డిసెంబర్, ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నిధులు మాత్రమే విడుదల చేశాయి. ఇలా కేంద్రం నిధులు 3 నెలలు, రాష్ట్ర ప్రభుత్వ నిధుల ఒక నెలవి పెండింగ్‌లో ఉన్నాయి.

అత్యవసర పనులకు అవస్థలు
గ్రామ పంచాయతీల్లో కొన్ని అత్యవసర పనులు చేపట్టాల్సి ఉంటుంది. మోటార్ కాలిపోవడం, పైపు లైన్లు దెబ్బతిన్నప్పుడు వాటి మరమ్మతు, పారిశుద్ధ్య పనులు నిరంతరం చేపట్టాల్సి ఉంటుంది. వీటికి తోడు ట్రాక్టర్ డీజిల్ ఖర్చు, సిబ్బంది వేతనాలు, ట్రాక్టర్ కిస్తీలు ఎప్పటికప్పుడు చెల్లించాల్సిందే. ప్రతినెలా పంచాయతీలకు నిర్వహణ నిధులు విడుదలైతే ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. కానీ నిధులు పెండింగ్‌లో ఉండడంతో సర్పంచ్‌లు అప్పులు చేసి గ్రామాల్లో పనులు చేపట్టడంతోపాటు, సిబ్బంది వేతనాలు చెల్లిస్తున్నారు. ఇక, కొన్ని పంచాయతీల్లో సర్పంచ్‌లు ట్రాక్టర్ డీజిల్, కిస్తీల భారం భరించలేక ట్రాక్టర్లను ఎంపీడీఓ కార్యాలయంలో వదిలేసి వెళ్తున్న పరిస్థితి ఉంది.

అభివృద్ధి పనుల నిధులు కూడా పెండింగ్‌లోనే..

గ్రామ పంచాయతీలకు ప్రతి నెలా వచ్చే నిర్వహణ నిధులు సక్రమంగా విడుదల కాకపోగా.. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులకు కూడా పెండింగ్‌లోనే ఉంటున్నాయి. డ్రెయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణం ఇతర పనులు చేసిన బిల్లులు కొన్ని గ్రామ పంచాయతీలకు రూ.30 లక్షల పైచిలుకే పెండింగ్‌లో ఉన్నాయి. ఉపాధి హామీ పథకం కింద చేసిన పనుల బిల్లులు కూడా విడుదల కాకపోవడంతో సర్పంచ్‌లు తల పట్టుకుంటున్నారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు విడుదల చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.



పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థినులు

తొలిరోజు ప్రశాంతం

- ఇంటర్ ఫస్టియర్ పరీక్షకు 732 మంది గైరాజర్
- ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను అనుమతించని అధికారులు



తనిఖీ చేస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నల్లగొండ : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా సాగింది. కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. నిమిషం నిబంధనను అమలు చేశారు. నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రానికి ఇద్దరు విద్యార్థులు పరీక్ష సమయానికి నిమిషం ఆలస్యంగా రావడంతో లోపలికి అనుమతించలేదు. దీంతో వారు వెనుదిరిగి వెళ్లిపోయారు. మొదటి రోజు ఫస్టియర్ పరీక్షకు 15,862 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 15,130 మంది హాజరయ్యారు. 732 మంది గైరాజరయ్యారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ..
కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, పరీక్ష సరళిని ఆయన పరిశీలించారు.



నల్లగొండలోని బాలికల జూనియర్ కళాశాల కేంద్రంలో హాల్ టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

ఎన్‌ఎస్‌పీ క్వార్టర్ల రిజిస్ట్రేషన్

- 620 క్వార్టర్లకుగాను గాను 215 పూర్తి
- నిడమనూరు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రక్రియ



రిజిస్ట్రేషన్ల కోసం వేచి ఉన్న యజమానులు

నాగార్జునసాగర్ : ఏళ్లతరబడి నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాలనీల్లోని క్వార్టర్లలో నివాసముంటున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం 59 జీఓ ప్రకారం వారికే అప్పగిస్తోంది. ఈ మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముమ్మరంగా సాగుతుంది. ప్రభుత్వం తరఫున పెద్దవూర తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. బుధవారం సాయంత్రం వరకు 215 మందికి ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసినట్లు పెద్దవూర తహసీల్దార్ సైదులుగౌడ్ తెలిపారు. నిడమనూరు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పూర్తిగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్వార్టర్ల రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయి. అధికారులతో పాటు ఇంటి యజమానులు సహకరిస్తే మరో వారంలో ప్రక్రియను పూర్తి చేస్తామని తహసీల్దార్ పేర్కొంటున్నారు.

1468 మంది దరఖాస్తు..
నందికొండ మున్సిపాలిటీలోని ఎన్‌ఎస్‌పీ క్వార్టర్ల కోసం 1468 మంది దరకాస్తు చేసుకున్నారు. 837 మంది దరకాస్తులను వివిధ కారణాలతో నిరాకరించారు. వాటిలో 631 దరకాస్తులను అధికారులు ఓకే చేశారు. వారిలో 620 మంది ప్రభుత్వం నిర్ణయించిన రేటును చాలానా రూపంలో చెల్లించినట్లు సమాచారం. వారికి ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. మొదటి వారంలో రోజుకు 20 నుంచి 30వరకు రిజిస్ట్రేషన్ చేయగా బుధవారం ఒక్కరోజే 60మందికి రిజిస్ట్రేషన్ చేశారు.

మరికొందరి ఎదురుచూపు..
ప్రభుత్వం ఇటీవల 58, 59 జీఓలను విడుదల చేసింది. తొలుత 2014 జూన్ 2వ తేదీ నాటికి ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి వాటిపై హక్కులు కల్పిస్తామని చెప్పింది. తర్వాత ఆ కటాఫ్ తేదీని 2020 జూన్ 2వ తేదీ వరకు పొడిగించింది. దరఖాస్తులకు మరో నెలపాటు అవకాశం కల్పించింది. అయితే నందికొండలో పూర్తిగా ప్రభుత్వ స్థలాలే. అందుకే నందికొండలోని నివాసితులందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. స్థలాలు ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్న వారు ప్రభుత్వం తగిన రేటు నిర్ణయించినా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వ ప్రకటన కోసం వారంతా ఎదురుచూస్తున్నారు.

ఇంధన వనరులపై దృష్టి సారించాలి

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

నల్లగొండ : ప్రత్యామ్నాయ ఇంధన వనరులైన నీరు, గాలి, సూర్యరశ్మి, సముద్రపు తరంగాల శక్తి, భూతాపశక్తి, జీవశక్తి వంటి వాటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అదనపు కలెక్టర్ భాస్కరరావు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం – 2023 సందర్భంగా 'స్వచ్ఛమైన ఇంధన పరివర్తన ద్వారా వినియోగదారులకు సాధికారత కల్పించడం' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవన విధానంలో వేగం, విజ్ఞానం పెరిగిందనన్నారు. ఇంధనాలు మూల్యమైనవని, వాటిని కాపాడుకోవడం మన బాధ్యత అన్నారు. ఆధునిక జీవన విధానంలో విద్యుత్ అత్యంత కీలకంగా మారిందని అవసరాల మేరకు విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు వనరుల కొరత ఏర్పడుతోందని చెప్పారు. జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు క్రిష్టోఫర్ మాట్లాడుతూ ఏదైనా వస్తువు కొనుగోలు చేసినప్పుడు రసీదు, గ్యారెంటీ, నాణ్యత ప్రమాణాలు విధిగా పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యులు సంధ్యారాణి, వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ నాగేశ్వరరావు, ఆర్‌టీఓ సురేష్ రెడ్డి, వినియోగదారుల హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు హిమగిరి, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ డెలివరీ చేయాలి
నల్లగొండ : 2021– 22 యాసంగి సీఎంఆర్‌ను ఈ నెలాఖరులోగా డెలివరీ చేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు మిల్లర్లను ఆదేశించారు. బుధవారం ఆయన పౌర సరఫరాల శాఖ, ఎఫ్‌సీఐ అధికారులు, రైస్ మిల్లర్లతో కలిసి నల్లగొండలోని ఎఫ్‌సీఐ గోదాంలో బఫర్ నిల్వ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గోదాం ఆవరణలో మొక్క నాటారు. అనంతరం యాసంగి 2021–22 సీఎంఆర్ డెలివరీ, అన్‌లోడింగ్ సమస్యపై చర్చించారు. యాసంగి 2021 – 22 సీజన్‌లో 2 లక్షల 23 వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ లక్ష్యం కాగా 1 లక్షా 93 వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ డెలివరీ చేశారని.. ఇంకా 30 వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ డెలివరీ చేయాల్సి ఉందని చెప్పారు. ఆయన వెంట పౌర సరఫరాల డీఎం నాగేశ్వరరావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నల్లగొండ అధ్యక్షులు యాదగిరి, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, ఎఫ్‌సీఐ అధికారులు ఉన్నారు.

పీడితుల కోసం పరితపించిన నేత బీఎన్

- ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి అశోక్



ర్యాలీలో పాల్గొన్న ఎంసీపీఐ(యూ) నాయకులు

మిర్యాలగూడ అర్బన్: సామాజిక న్యాయం, బహుజన రాజ్యాధికారం, పీడిత ప్రజల కోసం నిరంతరం పరితపించిన నేత భీంరెడ్డి నరసింహారెడ్డి (బీఎన్) అని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దివంగత నేత భీంరెడ్డి నరసింహారెడ్డి శత జయంతి ఉత్సవాల ముగింపు సభను బుధవారం ఎంసీపీఐ(యూ) నాయకులు మిర్యాలగూడ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సుందరయ్య పార్కు నుంచి రాజీవ్‌చౌక్ మీదుగా బైపాస్ రోడ్డులో గల భీంరెడ్డి నరసింహారెడ్డి విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అశోక్ మాట్లాడుతూ బీఎన్ ఆశయ సాధన కోసం నేటి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, కార్యదర్శి వర్గ సభ్యులు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, వస్కుల మట్టయ్య, వెంకన్న, సైదమ్మ, గోపి, అనిల్‌కుమార్ ఉన్నారు.

కార్డుల పేరిట టోకరా..



తహసీల్దార్ స్వాధీనం చేసుకున్న కార్డులు

గుర్రంపోడు : ప్రభుత్వం రేషన్ కార్డులు వచ్చాయని.. వాటిని తీసుకోవాలంటూ గుర్రంపోడు మండలంలో కొందరు డీలర్లు కార్డుకు రూ.200 వసూలు చేస్తున్నారు. వినియోగదారుల పేరు, నంబర్‌తో కార్డు తయారు చేయించి వారికి టోకరా వేస్తున్నారు. ఈ కార్డు తీసుకోకుంటే మీకు వచ్చే నెల నుంచి సరకులు రావని భయపెట్టడంతో భారమైనా డబ్బులు చెల్లించి ప్రజలు ఈ కార్డులు తీసుకుంటున్నారు. మండలంలో పలు గ్రామాల్లో రేషన్ డీలర్లు ఈ తరహా కార్డులు విక్రయిస్తున్న విషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయి. బుధవారం సివిల్ సప్లయి అధికారులు, రెవెన్యూ సిబ్బంది, పలు గ్రామాల రేషన్ డీలరు వద్ద నుంచి కార్డులు స్వాధీనం చేసుకుని తహసీల్దార్‌కు అప్పగించారు. ఈ విషయమై తహసీల్దార్ హుస్సేన్‌ను వివరణ కోరగా.. ప్రభుత్వం ఎలాంటి రేషన్ కార్డులు ఇవ్వడం లేదని, కార్డుల వివరాలు ఆన్‌లైన్‌లోనే ఉన్నప్పుడు ఈ తరహా కార్డులతో ఉపయోగమే లేదని చెప్పారు.

రోజూ వంద మందికి పని కల్పించాలి



కొప్పోలులో ఉపాధికూలీలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా

- అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా

గుర్రంపోడు : గ్రామ పంచాయతీల్లో ప్రతిరోజూ వంద మందికి తగ్గకుండా ఉపాధి కూలీలకు పని కల్పించాలని అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కొప్పోలు, పిట్టలగూడెం, వట్టికోడు గ్రామ పంచాయతీల్లో నర్సరీలు, శ్మశాన వాటికలు, వర్మి కంపోస్టు షెడ్‌లు, ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించారు. నర్సరీల్లో వంద శాతం మొక్కలు బతికేలా నారు దశ నుంచే సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కొప్పోలు గ్రామంలో చాలా దూరం కాలినడకన ప్రయాణించి ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లారు. పనులు తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. వట్టికోడులో కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ శ్రీపాద సుధాకర్, ఎంఈఓ తరి రాము, ఏపీఓ గోపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు తిరుగుడు జ్యోతి లింగారెడ్డి, కేసాని యాదగిరిరెడ్డి, పోలె రాములమ్మ రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

మామిడికి మంచు దెబ్బ

- వాతావరణ మార్పులతో రాలుతున్న పూత, పిందె
- దిగుబడిపై ప్రభావం చూపుతుందని రైతుల ఆవేదన
- సేంద్రియ పద్ధతులు పాటించే తోటల్లో కాస్త మెరుగు



పూత ఉన్న మామిడి చెట్టు

నల్లగొండ రూరల్ : ఫలరాజు మామిడికి మంచుదెబ్బ తగులుతోంది. వాతావరణ మార్పులతో మంచు కురవడం, రాత్రి చలి, పగలు వేడి కారణంగా మామిడి తోటల్లో పూర్తి స్థాయిలో పూత రావడంలేదని, వచ్చిన పూత, పిందె రాలుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే దిగుబడి తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు వాపోతున్నారు.

2,683 హెక్టార్లలో సాగు..
నల్లగొండ జిల్లాలో 2,683 హెక్టార్లలో మామిడి సాగులో ఉంది. సహజంగా డిసెంబర్ – జనవరి నాటికి మామిడి తోటలో పూత, పిందె దశ పూర్తవుతుంది. మామిడి సాధారణంగా హెక్టార్‌కు 10–12 టన్నుల దిగుబడి వస్తుంది. ఈ సారి వాతావరణ మార్పులతో మామిడి బెట్టుకు (వాడు) రావడం ఆలస్యమైంది. ఫిబ్రవరిలో పూత వచ్చింది. కానీ, పగలు వేడి, రాత్రి మంచు కురవడంతో పూత పిందె దశలో రాలిపోతున్నాయి. ఎన్ని యజమాన్య పద్ధతులు చేపట్టినా పిందె నిలవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు నిరాశే..
ఈ ఏడాది మామిడి దిగుబడి ఆర్థికంగా గట్టెక్కిస్తుందని ఆశించిన రైతులకు నిరాశ మిగిలించేలా వాతావరణ పరిస్థితులు ఉన్నాయి. జనవరి చివరి నాటికి మామిడిలో బఠానీ గింజ పరిమాణంలో పిందెలు ఏర్పడాల్సి ఉంది. ఆ సమయంలో తేలికపాటి నీటి తడులను అందిస్తారు. అయితే సేంద్రియ పద్ధతులు అవలంబిస్తున్న రైతుల తోటలో పూత, కాత ఆశాజనకంగా ఉందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. తోట మొత్తం వచ్చిన పూతలో 60శాతం నిలిచినా మించి దిగుబడులు వస్తాయని ఉద్యాన అధికారులు అంచనా వేశారు. గతేడాదితో పోల్చితే ఈసారి మామిడి పూత, కాత తగ్గిందని, ఎండల తీవ్రతను బట్టి దిగుబడిపై అంచనా వేయొచ్చని అధికారులు చెబుతున్నారు.

సస్యరక్షణ ఇలా..

రైతులు మంచు వల్ల మామిడిలో బూడిద తెగులు, తేనెమంచు తెగులు వ్యాపించకుండా నివారణకు సరైన ఎండ, గాలి తగిలేలా చెట్ల కొమ్మల మధ్య ఎండు పుల్లలు కత్తిరింపు లాంటి చర్యలు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు. మామిడికాయల కోత తర్వాత ఎండు పుల్లను గుబురుగా ఉన్న కొమ్మలను కత్తిరించడంతోపాటు సేంద్రియ ఎరువులను ఉపయోగించడం ద్వారా ఆశించిన స్థాయిలో దిగుబడి లభిస్తుంది.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులు మామిడి తోటల్లో ఉద్యాన అధికారుల సూచన మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. పూతరాలుతున్న సమయంలో మైక్రో న్యూట్రీన్స్ లాంటి మందులను పిచికారీ చేయాలి. సేంద్రియ ఎరువులనే ఉపయోగించాలి. ఈసారి 3 దశలుగా పూత వచ్చింది. ఫిబ్రవరి 15–20వ తేదీలోపు వచిన పూత మన జిల్లా వాతావరణానికి నిలబడుతుంది. చెట్లు గుబురుగా లేకుంట ఎండు పుల్లలు కత్తిరించాలి. బంక రాకుండా కార్బండిజం పిచికారీ చేయాలి.

– సంగీతలక్ష్మి, జిల్లా ఉద్యాన అధికారి

పూత రాలుతోంది



పూత ఆలస్యంగా వచ్చినప్పటికీ వాతావరణ పరిస్థితుల వల్ల రాలిపోతోంది. పూర్తిగా సేంద్రియ పద్ధతిలోనే మామిడి సాగు చేపట్టాం. ఎండలు ముదురుతున్నా కొద్దీ పిందె రాలుతోంది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది పూత, కాత తక్కువే కనిపిస్తోంది.

రఘుపతి, రైతు, ధర్మాపురం

క్లుప్తంగా

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న మానిటర్లు

భువనగిరి : చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ సత్యనారాయణ బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని పహడీనగర్‌కు చెందిన ఎంఏ జహీద్ స్థానిక ఖిలానగర్ సమీపంలోని సెంట్రల్ జీఎస్టీ కార్యాలయానికి తాళం వేసి ఈ నెల 10వ తేదిన స్వగృహానికి వెళ్లారు. తిరిగి ఈ నెల 13వ తేదీన ఉదయం వెళ్లి చూసే సరికి తాళం పగులగొట్టి ఉండటంతో కార్యాలయంలో పరిశీలించారు. చోరీ జరిగిందని భావించి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో భాగంగా దొంగతనాల కేసుల్లో జైలు నుంచి వచ్చిన నమ్మకమైన సమాచారం మేరకు మండలంలోని వడపర్తి గ్రామానికి చెందిన మేడబోయిన శ్యామ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో దొంగతనం చేసినట్లు అంగీకరించడంతో అతని వద్ద నుంచి కంప్యూటర్, మానిటర్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

హరితహారం మొక్కలు దగ్ధం


దామెరభీమనపల్లిలో కాలిపోయిన హరితహారం మొక్కలు

మర్రిగూడ: గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో హరితహారం మొక్కలు దగ్ధమయ్యాయి. మర్రిగూడ మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దామరభీమనపల్లి గ్రామంలో రెండేళ్ల క్రితం రహదారికి ఇరువైపులా నాటిన 35 నుంచి 40 వరకు మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణకు ప్రభుత్వం రెండేళ్ల పాదులు చేయడం, నీరు పెట్టడం, రక్షణ వలయాలు ఏర్పాటు చేయడం వంటి వసతులను కల్పించి రక్షిస్తున్నారు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మొక్కలు పూర్తిగా కాలిపోయాయి. మొక్కలను దగ్ధం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, కాలిపోయిన మొక్కల స్థానంలో అధికారులు వెంటనే కొత్త మొక్కలను నాటి మరల ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఎంపీడీఓ జె.వెంకటేశ్వర్‌రావును వివరణకై సంప్రదించగా మొక్కలకు అగ్ని పెట్టిన కారకులపై చర్యలు తీసుకోవడంతోపాటు జరిమానా విధిస్తామన్నారు.

డీసీపీ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ


తనిఖీలు చేస్తున్న డీసీపీ, పోలీసులు

భువనగిరి : భువనగిరి పట్టణ శివారులో నల్లగొండ రోడ్డు మార్గంలో డీసీపీ రాజేష్‌చంద్ర ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వాహనాలు తనిఖీ చేసారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేకపోవడం, నంబర్‌ప్లేట్ ట్యాంపరింగ్ చేయడం వంటి వాహనాలని తనిఖీ చేశారు. ఆయన వెంట ఎస్ఐ సైదులు సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆలస్యంతో అనుమతి నిరాకరణ

- ఇంటర్ పరీక్ష రాయకుండానే వెనుదిరిగిన పలువురు విద్యార్థులు

నల్లగొండ/ మోత్కూరు/ హుజూర్‌నగర్/ దేవరకొండ : ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. అయితే నిమిషం నిబంధన అమలులో ఉండడంతో పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన పలువురు విద్యార్థులను అధికారులు అనుమతించలేదు. దీంతో సదరు విద్యార్థులు పరీక్ష రాయకుండానే వెనుదిరిగారు. మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఏ, బీ పరీక్షా కేంద్రాల్లో ఉదయం 8.30 గంటలకే విద్యార్థులకు తనిఖీలు నిర్వహించి అధికారులు, ఇన్విజిలేటర్లు తరగతి గదుల్లోకి అనుమతించారు. 9 గంటల 20 నిమిషాల తరువాత దత్తప్పగూడెం గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు తొంట రాముడు, లక్ష్మణులు ఆలస్యంగా పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఆత్మకూరు(ఎం) మండలం చిన్నగూడెం గ్రామానికి చెందిన బెజ్జరబోయిన మనోజ్ అదే సమయంలో పరీక్ష కేంద్రానికి చేరుకున్నాడు. దీంతో అధికారులు వారికి అనుమతించక పోవడంతో పరీక్ష రాయకుండానే వెనుదిరిగి పోయారు. అదే విధంగా హుజూర్‌నగర్‌లోని ప్రియదర్శిని కాలేజీలో 330 మంది విద్యార్థులకు 321 మంది హాజరుకాగా 9 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. కాగా బూరుగడ్డకు చెందిన ఇరువురు విద్యార్థులు 15 నిమిషాలు ఆలస్యంగా పరీక్షా కేంద్రానికి వచ్చారు. అయినా వారిని అధికారులు పరీక్షా కేంద్రంలోనికి అనుమతించలేదు. దేవరకొండలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన విద్యార్థినిని లోపలికి అనుమతించలేదు. నల్లగొండలోని ప్రతిక్‌రెడ్డి కాలేజీకి ఆలస్యంగా వచ్చిన ఇద్దరు విద్యార్థులను సైతం అధికారులు అనుమతించలేదు.


నల్లగొండ : ప్రతిక్‌రెడ్డి కాలేజీ గేటు వద్ద విద్యార్థులు


మోత్కూరు : వెనుదిరుగుతున్న విద్యార్థులు


దేవరకొండ: కళాశాల గేటు బయట వేచిచూస్తున్న విద్యార్థి


హుజూర్‌నగర్: పరుగెత్తుకుంటూ వస్తున్న విద్యార్థులు

బీఎన్ కల సాకారం చేసిన ఘనత కేసీఆర్‌దే


బీఎన్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి తదితరులు



- బీఎన్ విగ్రహావిష్కరణలో మంత్రి జగదీశ్‌రెడ్డి

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతాలకు గోదావరి జలాలను తీసుకు రావాలనే బీఎన్ చిరకాల వాంఛను నెరవేర్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని దాచారంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ భీంరెడ్డి నర్సింహారెడ్డి శతజయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. తుమ్మలపెన్‌పహాడ్ ఎక్స్ రోడ్‌లో బీఎన్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రామంలో స్మారక గ్రంథాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఏర్పాటుచేసిన సభలో మాట్లాడారు. తెలంగాణ సమాజం స్వేచ్ఛగా ఉందంటే దానికి కారణం బీఎన్ పోరాట ఫలితమేనన్నారు. వితంతువును వివాహమాడిన ఆదర్శమూర్తి అని, విసునూరు దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మకు దన్నుగా నిలిచి తెలంగాణ సాయుధ పోరాటాన్ని ప్రపంచానికి తెలిసే విధంగా మలుపు తిప్పిన వ్యూహకర్త అని కొనియాడారు. బీఎన్ జీవితం నేటితరానికి ఆదర్శం అని అన్నారు. రాజకీయంగా విభేదించినా.. ఆయనను అభిమానించే లక్షలాది మందిలో తాను ఒకడినని, బీఎన్ స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. బీఎన్‌రెడ్డి.. చేగువేరా అంతటి గొప్ప నాయకుడు అయిప్పటికీ ఆంధ్రా కమ్యూనిస్ట్ నాయకుల మోసానికి బలయ్యాడని తెలిపారు. ప్రాజెక్టులకు బీఎన్ పేరు నామకరణం చేసే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. దాచారం గ్రామంలో రూ.20లక్షలతో చేపట్టనున్న నూతన గ్రామ పంచాయతీ, రూ.12లక్షలతో చేపట్టే మురుగుకాలువల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, మర్ల చంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తూడి నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రసాద్, బోళ్ల సోమిరెడ్డి, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, జీడి భిక్షం, కొత్తగట్టు మల్లయ్య, దేవర కిషన్, బ్రహ్మం, శిల్పి శ్రీనివాస్ రెడ్డి, బీఎస్ కుమారుడు ప్రభాకర్‌రెడ్డి, బాబ్‌సాబ్, కపోతంరెడ్డి, తాటికొండ సీతయ్య, మూరగుండ్ల లక్ష్మయ్య, బొమ్మిడి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నాటక పోటీలు


'పెట్రోమాక్స్ పంచాయతీ' సాంఘిక నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

మిర్యాలగూడ: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం సంయుక్తంగా జాతీయ స్థాయి పద్య, సాంఘిక నాటక పోటీలు బుధవారం 6వ రోజుకు చేరుకున్నాయి. ఈ పోటీలను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ముడుంబై రామానుజాచార్యులు, రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య ఉపాధ్యక్షుడు గుంటి పిచ్చయ్య, మాజీ కౌన్సిలర్ పశ్యా శ్రీనివాస్‌రెడ్డిలు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన కాటన్‌కాల్ థియేటర్ వారు ప్రదర్శించిన 'పెట్రో మాక్స్ పంచాయతీ' సాంఘిక నాటిక, కర్నూలు జిల్లాకు చెందిన లలిత కళా సమితి వారు ప్రదర్శించిన శ్రీకృష్ణ కమలపాలిక' అనే పద్య నాటకం ప్రదర్శించారు. ఈ పోటీలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళామండలి అధ్యక్ష, కార్యదర్శులు భుజంగరావు, పులి కృష్ణమూర్తి, రామావతారం, మామిడాల ఉపేందర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

నేరేడుచర్ల : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామానికి చెందిన బెండు సతీష్(30) ఈనెల 8న మున్సిపాలిటీ పరిధిలోని నర్సయ్యగూడెం వద్ద ఎదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో గాయపడ్డాడు. అతని పరిస్థితి విషయమంగా ఉండటంతో 108 వాహనం ద్వారా మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. ఈ విషయంపై నేటి వరకు కూడా ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

ద్రాక్షపండ్ల లోడు డీసీఎం బోల్తా

- డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు క్షేమం
- ద్రాక్ష పండ్లను లూటీ చేసిన స్థానికులు
- జాతీయ రహదారిపై కేతేపల్లి మండలం కొర్లపహాడ్ శివారులో ఘటన


ద్రాక్షపండ్ల ట్రేలను ఎత్తుకెళ్తున్న స్థానికులు

కేతేపల్లి: కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ శివారులో శుక్రవారం డీసీఎం బోల్తా కొట్టింది. ఈప్రమాదంలో డ్రైవర్ పాటు అందులో ఉన్న మరో ఇద్దరు వ్యక్తుల సురక్షితంగా బయటపడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..మహారాష్ట్ర నుంచి ద్రాక్ష పండ్ల ట్రేల లోడుతో డీసీఎం లారీ ఒడిశా రాష్ట్రానికి బయలుదేరింది. ఈ క్రమంలో మార్గమధ్యలో బుధవారం ఉదయం కేతేపల్లిలో మండలంలోని కొర్లపహాడ్ శివారులో గల టోల్‌ప్లాజా సమీపంలోకి చేరుకోగానే లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలో బోల్తాకొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో లారీ నెమ్మదిగా వెళ్తుండటంతో డ్రైవర్‌తో పాటు అందులో ఉన్న మరో ఇద్దరు వ్యక్తుల సురక్షితంగా బయటపడ్డారు. లారీ బోల్తా కొట్టడంతో అందులో ఉన్న ద్రాక్షపండ్ల ట్రేలు చెల్లా చెదురుగా కింద పడిపోయాయి. విషయం తెలుసుకున్న స్థానికులు, రోడ్డు వెంట వెళ్తున్న వాహనదారులు వందలాదిగా అక్కడకు చేరుకున్నారు. ద్రాక్షపండ్ల ట్రేలను ఎత్తుకెళ్లారు. అరగంట సమయంలోనే పండ్లను పూర్తిగా లూటీ చేశారు. తొక్కిసలాట జరగటంతో ట్రేలతో పాటు ద్రాక్షపళ్లు అక్కడే ధ్వంసమయ్యాయి.

మహిళను మోసం చేసిన కేసులో నిందితుడి అరెస్ట్

మిర్యాలగూడ అర్బన్: మహిళను మోసంగించిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. టూటౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఓ యువతికి ఆరు నెలల క్రితం వివాహం అయ్యింది. ఈ క్రమంలో ప్రకాశ్‌నగర్‌కు చెందిన సంకబుద్ధి రాజు అలియాస్ రవికుమార్ సదరు మహిళకు పరిచయం అయ్యాడు. ప్రేమిస్తున్నానని, మాయ మాటలు చెప్పడంతో పాటు కొద్ది నెలలుగా తరుచూ ఆమెతో ఫోన్‌లో మాట్లడటం, చాటింగ్ చేసి పరిచయం పెంచుకున్నాడు. పెళ్లి చేసుకుంటానని, నీ భర్తకు విడాకులు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చాడు. దీంతో ప్రేమ నిజమని నమ్మిన సదరు మహిళ భర్తకు విడాకులు ఇచ్చింది. తరువాత రాజు పెళ్లికి నిరాకరించడంతో తాను మోస పోయానని భావించి ఈ నెల 10న నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆస్పత్రిలో కోలుకున్న తరువాత ఈ నెల 12న టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మహిళ ఆత్మహత్యాయత్నానికి ప్రేరేపించిన సదరు యువకుడిపై కేసు నమోదు చేసి బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వరికి ట్యాంకర్లతో నీరు

- వేసవి ఆరంభంలోనే ఎండుతున్న పొలాలు


చిట్యాల మండలం వెలిమినేడులో వరి పొలానికి ట్యాంకర్‌తో నీటి సరఫరా


వనిపాకలలో నీరు లేక ఎండిపోయిన పొలంలో రైతు మేడి రామలింగయ్య

చిట్యాల: వేసవికాలం ఆరంభంలోనే కొన్నిచోట్ల భూగర్భ జలాలు పడిపోతున్నాయి. నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని పలు గ్రామాల్లోని వ్యవసాయ బోర్లలో నీరు తగ్గిపోయి పంటలు ఎండిపోతున్నాయి. చిట్యాల మండలంలోని వనిపాకల గ్రామానికి సాగునీటినందించే ధర్మారెడ్డిపల్లి కాల్వ నీరు రాకపోవటంతో పాటు, చెరువుల్లోని నీరు నిల్వ లేకపోవటంతో ఆగ్రామంలో భూగర్భ జలాలు తగ్గిపోయాయి. దీంతో వ్యవసాయ బావుల్లోని నీరు ఎండిపోతుంది. దీంతోపాటు వేళాపాళా లేని విద్యుత్ సరఫరాతో పంటలకు నీరు అందటం లేదు. వెలిమినేడు గ్రామ పరిధిలో వ్యవసాయానికి ఐదారు గంటలకు మించి విద్యుత్ సరఫరా కావటం లేదు. వచ్చే విద్యుత్ ఏ సమయంలో వస్తుందో తెలియని పరిస్థితి ఉంది. దీంతో పలువురు రైతులు తమ వరి పంటలకు ట్రాక్టర్ ట్యాంకర్‌లతో నీటిని సరఫరా చేస్తున్నారు. వేలాది రూపాయలు ఖర్చయిన వరిపంటను కాపాడుకునేందుకు ట్రాక్టర్లతో నీటిని సరఫరా చేస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.


వనిపాకలలో ఎండిన వరిపొలం

పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన


పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న గిరిజనులు

చింతపల్లి : మండల పరిధిలోని బోట్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని కొర్ర మాన్‌సింగ్‌తండాలో మంగళవారం ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం చింతపల్లి పోలీస్ స్టేషన్ ఎదుట కొర్ర మాన్‌సింగ్ తండాకు చెందిన గిరిజనులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తండాకు చెందిన ముగ్గురు మహిళలతో పాటు చింతపల్లికి చెందిన ఓ వ్యక్తి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడనే అనుమానంతో పద్ధతి మార్చుకోవాలని చెప్పినందుకు లచ్చానాయక్‌పై దాడి చేశారని, దీంతో భయభ్రాంతులకు గురై క్ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. పోలీసులు స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

'ఆర్థోపెడిక్' క్యాంపుల నిర్వహణ అభినందనీయం

సూర్యాపేట : ఉచిత ఆర్థోపెడిక్ ఆపరేషన్ క్యాంపులను నిర్వహించడం అభినందనీయమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లారావు అన్నారు. బుధవారం మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సందర్భంగా ఎంవీఎన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐఎంఏ లయన్స్ క్లబ్ సహకారంతో జిల్లా కేంద్రంలోని భీమిడి రమేష్‌రెడ్డి ఆస్పత్రిలో చేసిన ఆర్థోపెడిక్ మోకాలు లింగ మెంట్ ఉచిత ఆపరేషన్ క్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో ఉచిత ఆర్థోపెడిక్ మెడికల్ క్యాంపు నిర్వహణ సంతోషకరమని అన్నారు. అంతకుముందు మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ చంద్రశేఖర్, మల్లు అరుణ్, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ రమేష్ చంద్ర, భీమిడి రమేష్‌రెడ్డి, సైదులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


మాంగళ్యం చూపుతున్న అర్చకులు

మేళ్లచెరువు : మండలకేంద్రంలోని మైహోం సిమెంట్ పరిశ్రమ నందుగల శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం అహోబిల చిన్న జీయర్ స్వామి, దయానంద స్వామివార్ల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. పరిశ్రమ 25వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు స్వామివారు అమ్మవార్ల మెడలో మాంగళ్యధారణ చేశారు. స్వామివారి కల్యాణం ఆద్యంతం అత్యంత భక్తిశ్రద్ధలతో సాగింది. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణ మండపాన్ని రంగురంగుల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. విశ్వక్సేన పూజతో కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు ప్రారంభించారు. అనంతరం పుణ్యాహవాచనం, స్వామి వారికి పాద ప్రక్షాళన చేశారు. వేద పండితులు మహాసంకల్పం మంత్రాలతో,చూర్ణిక, కన్యాదానం,మాంగల్యధారణ తలంబ్రాలు మొదలైన కల్యాణ ఘట్టాలను కొనసాగించారు. ముక్కోటి దేవతలు వీక్షిస్తుండగా స్వామివారు అమ్మవార్ల మెడలో మాంగళ్యధారణ చేశారు. తీర్థ ప్రసాద వినియోగాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మైహోం సిమెంట్ పరిశ్రమ చైర్మన్ డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు, మునగాల రామ్మోహనరావు, అరుణ దంపతులు, రంజిత్‌రావు, వి.ఎస్ .నారంగ్,చంద్ర శేఖర పాండే,లక్ష్మీనారాయణ పరిశ్రమ హెడ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బంగారు గొలుసు అపహరణ


చోరీ అనంతరం దుండగులు పారిపోతున్న దృశ్యం

కొండమల్లేపల్లి : గుర్తుతెలియని వ్యక్తులు ఓ మహిళ మెడలోంచి బంగారు గొలుసును అపహరించారు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. కొండమల్లేపల్లిలో ఉదయ్ టైలరింగ్ షాప్ నిర్వహిస్తున్న గడ్డం రమాదేవి పని ముగించుకొని రాత్రి 8.30 గంటల సమయంలో ఇంటికి వెళ్తుండగా బైక్ వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో నుంచి మూడున్నర తులాల బంగారు గొలుసును అపహరించుకుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు.

జూదరుల అరెస్ట్

ఆలేరు రూరల్: పేకాట రాయుళ్లను ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేరు పట్టణ పరిధిలోని రైల్వే ట్రాక్ ప్రక్కన కొంతమంది పేకాట ఆడుతున్నారు. పక్కా సమాచారంతో ఎస్ఓటీ పోలీసులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఏడుగురు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వీరి దగ్గర నుంచి రూ. 55750, నాలుగు సెట్ల పేక ముక్కలు, ఆటోను పట్టుకున్నారు. ఈ మేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరుకు సాగులో.. ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలి

- నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు సూచనలు

పాడి పంట

నడిగూడెం : చెరుకు సాగులో ఎప్పటికప్పుడు ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని సూచిస్తున్నారు... నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాల్‌రావు సూచిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 2,500 ఎకరాల్లో రైతులు చెరుకు పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం చెరుకు తోటలు లేత దశ(45రోజులు) లో ఉన్నాయి. ఈ దశలో ఎరువులతో పాటు నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారి చెబుతున్నారు.

ఎరువుల వాడకం ఇలా..

ఎకరానికి 40టన్నుల చెరుకు దిగుబడి సాధించేందుకు 40 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 90 కిలోల పొటాష్‌ను నేల నుంచి గ్రహిస్తుంది. ఒక ఎకరానికి సిఫారసు చేయబడిన ఎరువులు మోతాదు 100 కిలోల నత్రజని, 40 కిలోల భాస్వరం, 48 కిలోల పొటాష్ వాడాలి. భాస్వరం, పొటాష్‌లను దుక్కి దున్నే సమయంలో వేసుకోవాలి. నత్రజని ఎరువులను నాటిన 45 నుంచి 60 రోజులకు, 90 రోజుల్లో సమపాళ్లలో వేసుకోవాలి. నత్రజనినందించే జీవ ఎరువులైన అజటోబాక్టర్ (2 కిలోలు ఎకరానికి) లేదా అజోస్పైరిల్లం (4కిలోలు ఎకరానికి) 500 కిలోల పశువుల ఎరువుతో కలిపి రెండు దఫాలుగా నాటిన మూడవ రోజున సగభాగం, 45వ రోజున సగభాగం వేసుకోవాలి. దీంతో నత్రజని ఎరువుల్లో 25 శాతం వరకు తగ్గించుకోవచ్చు. అలాగే ఎకరానికి 3 కిలోల పాస్ఫోబ్యాక్టీరియా ముచ్చెలు నాటిన తరువాత ఆరవ రోజున నీటి తడి ఇచ్చే ముందు వేసుకుంటే భాస్వరపు ఎరువు సుమారు 25శాతం వరకు ఆదా చేయవచ్చు. అలాగే రెండు కిలోల వ్యాట్ 5 కిలోల పశువుల ఎరువుతో కలిపి వేసుకున్నప్పుడు చెరుకు వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెందుతుంది. అలాగే పోషకాలు, నీరు గ్రహించే సామర్థ్యం పెరిగి బెట్ట సమయంలో చెరుకును తట్టుకొనేలా చేస్తుంది. సిఫారసు చేయబడిన నత్రజనిని 50శాతం నాటిన 45 రోజులకు మొక్క మొదళ్ల వద్ద 5 సెం.మీ. లోతు గోతిలో వేసి, మట్టి కప్పాలి. భూమిలో లభ్య భాస్వరం ఎకరానికి 12 కిలోల కన్న తక్కువగా ఉన్నప్పుడు 40 కిలోల భాస్వరాన్ని ఇచ్చే ఎరువులను ఆఖరి దుక్కిలో వేసి కలపాలి. భూమిలో లభ్యమయ్యే పొటాష్ ఎకరానికి 108 కిలోల కన్నా తక్కువగా ఉన్నప్పుడు ఎకరానికి 48 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను ఆఖరి దుక్కిలో వేయాలి.


సాగులో ఉన్న చెరుకు పంట

నీటి యాజమాన్యం కీలకం

ప్రస్తుతం వేసవిలో నీటి కొరత ఉండే అవకాశం ఉంది. పంట దిగుబడి అధికంగా రావాలంటే నీటి యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటించాలి. పంట మొదటి నాలుగు నెలల్లో ఆరు రోజులకొకసారి, పక్వదశలో మూడు వారాలకొకసారి నీరుపెట్టాలి. డ్రిప్ విధానంలో అయితే నీటి పరిమితిని పొదుపుగా వాడుకోవచ్చు. జంట సాళ్ల పద్ధతిలో చెరుకు సాగు చేసినప్పుడు బిందు సేద్య పద్ధతికయ్యే ఖర్చును 50శాతం వరకు తగ్గించుకోవచ్చు. నీటి ఎద్దడి ఉన్నప్పుడు నాటిన మూడో రోజున ఎకరానికి ఒక టన్ను చొప్పున చెరుకు చెత్త కప్పడం వలన,భూమిలోని తేమ త్వరగా కోల్పోదు. కలుపు, పీక పురుగు ఉధృతి తగ్గుతుంది. ఈ పరిస్థితుల్లో యూరియా, మ్యూరెట్ ఆఫ్ పొటాష్ 2.5 శాతం పైరుపై పిచికారీ చేయాలి.